



# టాక్ షో కథలు

## – కిరణ్ ప్రభ

గత పది సంవత్సరాలుగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాదిమంది తెలుగువారిని అలరిస్తున్న కిరణ్ ప్రభ టాక్ షోలు, యు ట్యూబ్లో 900 పైగా ఉన్న విషయం కౌముది పాఠకులకు తెలుసనే అనుకుంటున్నాము. కొంతమంది పాఠకులు ఆ టాక్ షోలకు అక్షరరూపం ఇస్తే బాగుంటుందని అడుగుతున్నారు. వారి సూచనలమేరకు ఆ టాక్ షోల నుంచి ఎంపికచేసిన కొన్నింటిని నెలనెలా ఇలా అక్షరరూపంలో మీకందిస్తున్నాము.

# చలం జీవితం – సాహిత్యం

## -13-

*సుమారు మూడు దశాబ్దాలు తెలుగు జాతిని తట్టీ, తిట్టీ, ఊపీ, నిద్ర లేపీ, బాధించీ , బోధించీ తన రచనల కొత్త కాంతితో, కళ్ళు చెదర గొట్టే కొత్త జ్ఞానంతో, జీవితపు చీకటి కోణాలను వెలిగించి, కొత్త జీవితానంద జ్యోతులతో కొడిగట్టిన జీవితాలను ఉద్దీపింప జేసిన వాడు చలం. తెలుగు జాతికి ఒక కొత్త జీవిత దృక్పథం ఇచ్చిన వాడు చలం. తెలుగు సాహిత్యానికి ఒక కొత్త పరమార్థం కల్పించిన వాడు, తెలుగు పాఠకులలో ఒక కొత్త చైతన్యం కల్పించిన వాడు చలం. మానవుని ఇంద్రియాలకు సాధ్యమైనంత అనంత సుఖ పారవశ్యానికి తెలుగువారి కన్నులు తెరిచిన వాడు. మానవుని మనస్సుకు సాధ్యమైన అపార సుందర జీవితానందాన్ని , తెలుగు వాళ్ళ హృదయాలను మేల్కొలిపేవాడు. పూల పరిమాళాలనూ, శుక్రుని కాంతినీ, గాలి మార్దవాన్ని, ప్రకృతిలోని అసంఖ్యాక సౌకుమార్యాలనూ, తెలుగు వారి భావుకత్వంలో ప్రవేశ పెట్టిన వాడు చలం. తెలుగు కవిత్వానికి కొత్త సౌందర్య స్వర్గ ద్వారాలు తెరచిన వాడు. తెలుగు వచన సాహిత్యానికున్న ఇరుకు హద్దులు బద్దలు కొట్టి, తన కథలతో, నవలలతో, లేఖలతో, ప్రేమ లేఖలతో ఆకాశమంత విశాలం చేసినవాడు చలం. ముసలితనంతో మూలుగుతున్న తెలుగు పదాలకు కొత్త జీవ రక్తం ఎక్కించి, ఒక కొత్త వాడీ, వేడీ నింపి, ఒక కొత్త సౌరభాలకూ, సౌకుమార్యమూ ఇచ్చినవాడు. తప్పటడుగులు వేస్తున్న తెలుగు వాక్యానికి ఒక లాఘవమూ,*

*ఒక విశాలమూ, ఒక గడుసుదనమూ ఒక జాణతనమూ కలిగించిన వాడు చలం. " ఈ వాక్యాలు రాసింది రా. రా.గా అందరికీ పరిచయం అయిన రాచమల్లు రామచంద్రారెడ్డి గారు.*

పలు కోణాల, పలు భావాల, పలు సందిగ్ధాల, పలు సంక్లిష్టాల, పలు వైరుధ్యాల చలం. రచయితగానూ, వ్యక్తిగతం గానూ కూడా ఒక శతాబ్దపు సంచలనం.

1945 లో చలంగారు ఏలూరులో వుద్యోగం చేస్తున్నారు. లీల గారు ఆయనతో పాటే ఉంటున్నారు. కుటుంబం మాత్రం బెజవాడలోనే వుంది. చలంగారి భార్య రంగనాయకమ్మ గారు అరుణా చలం వెళ్ళిపోయాక, చలం గారికీ, లీల గారికీ మధ్య జరిగిన కొన్ని సంఘటనలు గురించి తెలుసుకుందాం. ఇది తెలుసుకునే ముందు ఒక మాట చెప్పుకోవాలి. ఈ లీలగారికి, 'అబ్బాయమ్మ' అని మరో పేరు కూడా వున్నదని మొదట అనుకున్నాం. అయితే ఈమెకు 'చెల్లాయమ్మ' అనే ఇంకో పేరు కూడా వుంది. బహుశా ఈ లీల అనే పేరు రాక ముందు 'అబ్బాయమ్మ'అనీ, 'చెల్లాయమ్మ' అనీ కూడా ఉండి వుండవచ్చు. ఒక్కోచోటా, ఒక్కోలా వుంది. మనం 70,80 సంవత్సరాల క్రిందటి సంగతులు మాట్లాడుకుంటున్నాం. కాబట్టి పేర్ల విషయంలో తేదీల విషయంలోనూ చిన్న చిన్న పొరపాట్లు ఉండి, ఉండవచ్చు. అయినా అది మన కథనానికి ఏమీ అడ్డం కాదు.

చలంగారూ, లీలగారూ చాలా ప్రేమగా ఉన్నట్లు ఉండేవారు. ఒకే ఇంట్లో వుంటున్నారు. భౌతికంగా దగ్గరగానే వున్నారు. కానీ, మానసికంగా వాళ్ళిద్దరికీ చాలా అగాధం ఉండేది. కారణం ఏమిటంటే, చలంగారు ఎప్పుడూ ఆలోచించడం, ఎప్పుడూ పూజలు చేస్తూ ఉండడం, ధ్యానం చేయడం.. ఇవి వాళ్ళ మధ్య వైరుధ్యానికి కారణం. లీలగారు, చలం గారి పట్ల చాలా శ్రద్ధగా ఉండేవారు, ఆయన కూడా తనపట్ల ఆసక్తి అనురక్తి చూపించాలనేది ఆమె భావన. ఆయనకీ కావలసినవి అన్నీ చేసి పెడుతుండేవారు. ముఖ్యంగా చేపల కూర లాంటివి. అలాగే ఆమెకు లోక వ్యవహారాల్లో విచక్షణా జ్ఞానం చాలా బాగుండేది.

చలంగారు ఎప్పుడూ ఆధ్యాత్మికంగా ఆలోచించడం, అరుణాచలం వెళ్లిరావడం, అలాగే భగవాన్ గురించి పదే పదే మాట్లాడడం – ఇవన్నీ లీల గారికి పెద్దగా నచ్చేవి కావు. ఆ విషయం చలం గారికి కూడా తెలుసు. అందుకని చలంగారు ప్రార్థిస్తుండేవారట "భగవాన్! ఈ సంబంధం లో నుండి మాకు ఔన్నత్యాన్ని ఇవ్వు. నేను అశక్తుడ్ని. ఆమెను విడిచిపోలేకుండా వున్నాను. నువ్వు దీన్ని తుంచేసి, నాకు స్వేచ్ఛను ఇవ్వు" అని.

ఒక్కోసారి లీలగారు, చలం గారిని అంటుండేవారట. "నీది ఒట్టి సన్నాసి బ్రతుకు. నీకు యెట్లా పట్టిందో స్త్రీ బలహీనత అనేది"అని.

"ఆమె కదల్లేదు. చలంగారు వదల్లేరు. బొటన వేలుతో నొక్కి చలంగారిని ఆ బురద లోనే ఉంచారు." ఇవి ఆయన రాసుకున్న వాక్యాలే. లీలగారి సంతానం విషయనికొస్తే – ఆమెకు ఒక కూతురు 15,16 సంవత్సరాలు ఉంటుంది. ఒక అబ్బాయి . అతడికి 7,8 సంవత్సరాలు ఉంటుంది.

ఆ అబ్బాయికి ఒకసారి విపరీతంగా జబ్బు చేసింది. దాదాపుగా ప్రాణం మీదకి వచ్చింది. ఆ కుర్రవాడు చచ్చిపోతాడు అని లీలగారు ఏడవడం ప్రారంభించారు. అప్పుడు చలం గారు అన్నారు "అతన్ని బ్రతికించమని నేను భగవాన్ ని ప్రార్ధిస్తాను. అతను బ్రతికితే గనక మీరు భగవాన్ ని చూడ్డానికి వస్తారా?"అని. ఆమెకు అంతగా ఇష్టం లేదు గానీ, కాకపొతే, కొడుకు యొక్క పరిస్థితి, అనారోగ్యం రోజు రోజుకీ దిగజారుతుండడంతో గత్యంతరం లేక "సరే " అన్నారు.

ఆ తర్వాత జరిగింది ఏమిటంటే.. ఇది తర్కానికి అందని చలం గారి విశ్వాసం. "నేను భగవాన్ కి టెలిగ్రామ్ ఇచ్చాను. ఆ కుర్రవాడికి జబ్బు వెంటనే తగ్గిపోయింది "అని రాసుకున్నారు. ఎలాగైతేనేం జబ్బు తగ్గింది. చలం గారు, లీల గారిని అడిగారు "నేనన్నట్టుగా జబ్బు తగ్గింది కదా! భగవాన్ దగ్గరకు వెళదాం రండి. "అని. చలం గారూ, లీల గారూ అబ్బాయీ, అమ్మాయీ కలసి అరుణా చలం వెళ్లారు. చలం గారికి , వాళ్ళ కుటుంబ సభ్యులు అందరికీ భక్తి భావం కలిగింది గానీ, లీల గారికీ, ఆవిడ పిల్లలకీ మాత్రం భగవాన్ ని చూసినా గానీ ఏమీ అనిపించలేదు.

చలంగారితో వాళ్ళు అన్నారట " ఎందుకు ఇక్కడకి తీసుకువచ్చారు? మాకేమీ అనిపించలేదు. మీరెందుకు భగవాన్ గురించి ఆలోచిస్తున్నారు "అని. చలంగారు వాళ్లకి నచ్చజెప్పాలని చూశారు గానీ, వాళ్లకి ఏ మాత్రం భక్తి భావన కలగలేదు. పైగా "ఇక్కడ నుండి వెళ్ళిపోదాం పదండి." అని భగవాన్ దగ్గర నుండి సెలవు తీసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా వెనక్కి తీసుకువచ్చేశారు. మరొక విషయం ఏమిటంటే, అప్పుడు భార్య రంగనాయకమ్మ గారు అరుణాచలంలోనే ఆ పూరి పాకలోనే వున్నారు.

చలం గారూ, రంగనాయకమ్మ గారు ఒకర్ని, ఒకరు చూసుకున్నారు గానీ, ఆమె సగం ఈ లోకంలోనూ, సగం వేరే లోకం లోనూ ఉండేవారు. చలంగారు కూడా భార్యను నిర్లిప్తంగా చూసి, లీలగారితో వెనక్కి వచ్చేశారు. ఇది ఒక సంఘటన.

వెనక్కి వచ్చేశాక లీలగారికి భగవాన్ పట్ల భక్తీ, ప్రేమా, అభిమానం కలగలేదు గానీ ఒక రకమైన మానసిక వ్యాధి పట్టుకుంది. 'నాకేదో పెద్ద జబ్బు చేస్తుంది. నేను తొందరలోనే చచ్చిపోతాను.' అనుకుంటుండేవారు.

అలా ఉండగా మరొక సంఘటన ఏమిటంటే.. . లీలగారి అబ్బాయికి మరోసారి విపరీతమైన జబ్బు చేసింది. ఈసారి బెజవాడలో ఉన్న డాక్టర్ రంగనాయకమ్మగారు స్వయంగా వచ్చి, కారులో లీలగారినీ, వాళ్ళ అబ్బాయినీ వెంట బెట్టుకొని, తన వైద్యాలయంలో ఉంచుకొని, వైద్యం చేశారు. ఆ కుర్రవాడికి పూర్తిగా జబ్బు నయం అయ్యే

వరకూ కూడా అతని క్షేమ సమాచారాలు చూసుకొని, పూర్తిగా బాగయిన తర్వాత పంపించారు. ఈ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ చలంగారు చెప్పారు. "నిజానికి నేను కుటుంబాన్ని వదిలేసి, లీల దగ్గరే వుంటున్నందుకు ఒయ్యికి ఎంతయినా కోపం వచ్చి ఉండాలి. కానీ, అవన్నీ కూడా మనసులో పెట్టుకోకుండా, ఎంతో ప్రేమతో, ఆదరంతో వచ్చి, లీలగారినీ, వాళ్ళ అబ్బాయినీ తీసుకెళ్లి నయం అయ్యే వరకూ చూసుకున్నారు. డాక్టర్ గారికి ఎప్పుడూ కరుణా, దయా వుంటుండేవి" అని ఆ సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు.

ఇలా రెండు సార్లు జబ్బు చేసి తగ్గినటు వంటి అబ్బాయి పేరు రంగారావు . తరువాత రోజుల్లో పెద్దవాడయ్యాక అతను కూడా డాక్టర్ అయ్యాడు. ఇంకో డాక్టర్ ని పెళ్లి చేసుకున్నాడు. వాళ్లిద్దరూ పిఠాపురం లో "వెంకటా చలం క్లినిక్ "అని ఒక ఆసుపత్రిని కూడా నడిపారు. ఆ తరువాత చలంగారు అరుణా చలం వెళ్ళిపోయాక ఈ కుర్రవాడు అప్పుడప్పుడు వెళ్లి చలంగారిని చూసి వస్తుండేవాడట. ఇవన్నీ 1945–47 మధ్యలో జరిగిన కొన్ని సంఘటనలు.

ఇన్ని సంఘటనలు జరుగుతున్న రోజుల్లో మరి రచయిత చలం గారు ఎలా వున్నారు? జీవితం కత్తుల వంతెన అయినా, నిప్పుల బాట అయినా చలం గారి కలం ఎప్పుడూ విశ్రాంతి తీసుకోలేదు. ఎన్ని సంక్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ, కూడా ఆయన రచనా వ్యాసంగాన్ని ఆపలేదు. ఈ సంవత్సరాల్లో "మ్యూజింగ్స్ "అనే టటువంటి పరంపరని కొనసాగిస్తూనే వున్నారు. అవి అక్కడక్కడా పత్రికల్లో కూడా వస్తూనే వున్నాయి. శ్రీ శ్రీ మహాప్రస్థానానికి పీఠికా, అమీనా అనే నవల చివరి భాగం, ఇక కథలూ, నవలలూ ఇలా పుంఖాను పుంఖాలుగా రాస్తూనే వున్నారు. ఆ రోజుల్లోనే "పురూరవ" లాంటి అద్భుత నాటకం రాసారు. ఆయన పట్ల తెలుగువాళ్ళలో అభిమానం, ఆరాధనా, విద్వేషం, విమర్శా అవి ఎలాగూ కొనసాగుతూనే వున్నాయి. ఇది ఇంత వరకూ జరిగిన చలంగారి వంటి వ్యక్తి గత జీవితం, రచనల గురించిన వివరాలు.

ఈ కథను ఇక్కడ ఆపి, మనం బెజవాడ వెళదాం. బెజవాడలో పిల్లల బాధ్యత అంతా డాక్టర్ గారి మీదే పడింది. పెద్ద పిల్లలు ఫర్వాలేదు. ఆమెకు సహాయం చేస్తూనే వున్నారు. తరువాత పిల్లలకి చదువూ అబ్బలేదూ, నాట్యమూ అబ్బలేదు. పకపక అప్పటికి ఇంకా చిన్న పిల్ల. 1946కి ఆమెకు 13 సంవత్సరాల వయసు ఉంటుంది. అంతగా లోక జ్ఞానం తెలియనటు వంటి అమ్మాయి. చిత్రకి 14, 15 సంవత్సరాలు. నర్తకి కాస్త పెద్దది. ఇందులో చిత్ర ఒక విచిత్రమైన స్వభావం ఉన్న అమ్మాయి. తరచూ బెజవాడ వీధుల్లోకి వెళ్లి, వాళ్ళను పరిశీలించి, వాళ్ళు మాట్లాడుకునే భాష అంతా కూడా నేర్చుకుంది. ముఖ్యంగా ఇంట్లోకి వచ్చి బూతులు మాట్లాడేది. ఇంట్లో వాళ్ళు 'ఈ మాటలు ఎక్కడ నేర్చుకుందా' అని ఆశ్చర్య పడేవారు.

డాక్టర్గారికి ఇటు పిల్లల్నీ, అటు క్లినిక్ నీ చూసుకోవడానికి సమయం ఉండేది కాదు. అందుకని, చిత్ర బెజవాడలో ఉంటే, ఇలాంటి మాటలు నేర్చుకొని ఏమవుతుందోనని హైదరాబాద్ లో ఒక బోర్డింగ్ స్కూల్ లో

చేర్పించారు. చిత్ర అక్కడే ఉండి కొన్నాళ్ళు ఉండి చదువుకుంది. మధ్యలోనే అక్కడ నుండి పారిపోయి, హైదరాబాద్ లో వున్న వాళ్ళ పెద్దమ్మ ఇంటికి వెళ్ళిపోయింది. వాళ్ళింట్లో కొన్నాళ్ళు ఉన్నాక, "నేను బెజవాడ వెళ్ళిపోతాను "అని బెజవాడ వస్తూ.. వస్తూ.. ఆ పెద్దమ్మగారి ఇంట్లో ఉంటున్న ఒక అబ్బాయి ఫోటో తీసుకువచ్చింది. వచ్చిన తరువాత ఇంట్లో వాళ్లకు ఫోటో చూపించి "ఇదిగో ఈ అబ్బాయిని పెళ్లి చేసుకుంటాను "అంది. ఆ అబ్బాయి పేరు "శ్రీనివాసరావు." అందరూ "శ్రీ" అనే వారు.

ఈ చిత్ర లో ఉన్న ప్రత్యేకత – రాజీ లేని స్పష్టత. ఏదైనా సరే, సాధించాలి అనుకుంటే, ఆ పని అయ్యేంత వరకూ నిద్రపోదు. ఆమె స్వభావం తెలిసినటు వంటి డాక్టర్ గారు " సరే! నీకు నచ్చితే వివాహం చేసుకో" అన్నారు. ఆమె అంగీకరించిన మీదట చిత్ర వివాహం 1946 చివరిలో తిరపతిలో జరిగింది. ఆ వివాహానికి చలం గారు వెళ్ళలేదు. నిజానికి చలంగారి కుటుంబంలో జరిగినటువంటి మొదటి శుభకార్యం. మరి వివాహ వ్యవస్థ మీద ఏమాత్రం నమ్మకం లేని చలంగారు ఆ వివాహానికి వెళ్లక పోవడంలో ఆశ్చర్యం లేదు. ఆ వివాహానికి డాక్టర్ గారూ, నిర్మలా, వసంత్ వెళ్లారు. సౌరీస్ బెజవాడలోనే ఉండి క్లినిక్ చూసుకుంది. అయితే, ఈ వివాహం జరిగినపుడు డాక్టర్ గారికి హఠాత్తుగా తెలిసిన విషయం ఏమిటంటే, చిత్ర ను పెళ్లి చేసుకున్న అబ్బాయికి 'మూర్ఛ'వ్యాధి లాంటిది ఏదో ఉందని. పెళ్లి జరుగుతున్నప్పుడే ఒకసారి పడిపోయాడు. అదంతా తెలిసి డాక్టర్ గారు, చిత్రని అడిగారు. "ఏమిటమ్మా! నీ ఎంపిక ఇలా వుంది?"అని. కానీ, ఆమె ప్రేమించింది కాబట్టీ "నేను ఎలాగైనా ఇతనితోనే వెళతాను"అంది. పెళ్లయిన తర్వాత అత్తవారింటికి వెళ్ళిపోయింది.

1947 వ సంవత్సరం వచ్చేసరికి డాక్టర్ గారు విపరీతంగా అలసిపోయారు. ఇన్ని పనులూ, ఇంత మందిని చూసుకోవడంతో ఆమె ఆరోగ్యం కొంచెం.. కొంచెం .. దిగజారడం ప్రారంభమయింది. కాస్త విశ్రాంతి తీసుకోమని సౌరీస్, నిర్మలా చెబుతుండేవారు "ఒయ్యా! నువ్వు పని చెయ్యొద్దు. అక్కడ కూర్చో. మేం చూసుకుంటాం లే" అనేవారు. కానీ, ఆమె వినకుండా, పేషంట్ల కోసమని, శ్రమ పడుతుండేవారు. ఈసారి మాత్రం ఆమెకు విపరీతంగా ఆయాసం రావడం, జరుగుతుంటే, ఒకసారి సౌరీస్ "అలా కాదు నువ్వు ఒకసారి పెద్ద డాక్టర్ కి చూపించుకో" అని వసంత్ ని వెంట ఇచ్చి, డాక్టర్ రంగనాయకమ్మ ని విశాఖపట్నం పంపించారు. విశాఖ వెళ్లి అక్కడ డాక్టర్ తో పరీక్ష చేయించుకున్నాక, వాళ్ళు చెప్పారు. "ఇదేదో తీవ్రమైన వ్యాధి లాగ వుంది. కేన్సర్ అని మాకు అనుమానం. ఒకసారి మద్రాస్ వెళ్లి చూపించుకోండి "అని.

అక్కడ నుండి వసంత్ పెద్దమ్మను తీసుకొని మద్రాస్ వెళ్ళాడు. అక్కడ డాక్టర్లు చాలా మందికి అంతు చిక్కలేదు. థామస్ అనే డాక్టర్ మాత్రం అన్ని పరీక్షలూ చేశాక, "ఇది ఖచ్చితంగా కేన్సర్ అయివుంటుంది. మేజర్ ఆపరేషన్ చేసి గర్భ సంచి తీసెయ్యాలి" అని ఆ గర్భసంచి తీసేసారు. ఆ ఆపరేషన్ అయిన కొద్ది రోజులకు

పెద్దమ్మను, బెజవాడ తీసుకువచ్చేసాడు వసంత్. అప్పటికే ఆమె విపరీతంగా అలసిపోయి, చాలా నీరసంగా వున్నారు. గర్భ సంచి తీసేసినా గానీ, లోపల ఏదో వ్యాధి వుంది. అది తిరగబెడుతూనే వుంది.

ఆమెను తీసుకువచ్చిన మరుచటి రోజు చలం గారి కుటుంబానికి ఒక వూహించనటు వంటి దెబ్బ. అనుకోని సంఘటన జరిగింది. అదేమిటంటే, ఆ కుర్రవాడు వసంత్, ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్ళిపోయాడు. సాధారణంగా రెండు, మూడు రోజులు అలా వెళ్లడం, మళ్ళీ వెనక్కి రావడం జరుగుతుండేది. కానీ, ఈసారి మాత్రం ఒక వుత్తరం వచ్చింది.. ఆ ఉత్తరంలో రాశాడు “నేనెక్కడికో వెళ్లి పోతున్నాను. నా కోసం వెతక్కండి. నా శరీరం కూడా మళ్ళీ మీకు కనిపించదు. “అని రాశాడ. నిజానికి ఈ వసంత్ సోమరి, ఏ పనీ చేసేవాడు కాదు. కానీ, తన 25 ఏళ్ళ జీవితంలో అతను చేసిన మంచి ఒక్కటే – ఒయ్యి ని వెంటబెట్టుకొని విశాఖపట్నం వెళ్లడం, అక్కడ నుండి మద్రాస్ తీసుకువెళ్లి,ఆపరేషన్ అయ్యే వరకూ జాగ్రత్తగా చూసుకొని మళ్ళీ బెజవాడ తీసుకురావడం. బహుశా చిన్నప్పటి నుండి కూడా డాక్టర్ గారు తన మీద చూపించిన ఆత్మీయతకు, వసంత్ ఇచ్చిన చిట్టచివరి నివాళి అయివుంటుంది.

“ఇక నా కోసం వెతక వద్దు.”అని ఉత్తరం వచ్చాక, ఇంట్లో వాళ్ళు చాలా బాధ పడ్డారు. అప్పటికి చలం గారు ఏలూరు లో వుద్యోగం మానేసి, ఇంకా సర్వీస్ ఉన్నప్పటికీ  రాజీనామా ఇచ్చేసి, లీల గారితో “నూజివీడు” లో వుంటున్నారు. ఈ కబురు తెలిశాకో, తెలియక ముందో చలం గారు నూజివీడు నుండి బెజవాడ వచ్చారు. అబ్బాయి రాసినటు వుత్తరం చూసి, ఆయన కూడా బాధ పడ్డారు. చలం రి  నమ్మకం ఏమిటంటే... ‘ తాను ఏదో వుత్తరం లోనో, వ్యాసంలోనో ఏదో రాసాను. అది తన గురించే రాశానని అపార్థం చేసుకొని వసంత్  ఇంట్లో నుండి వెళ్ళిపోయి ఉంటాడు ‘ అనుకున్నారు. డాక్టర్ గారైతే “ఆ కుర్రవాడు చచ్చిపోవడానికే వెళ్ళిపోయి ఉంటాడని నా నమ్మకం” అన్నారు.

సౌరీస్ మాత్రం “లేదు ఎక్కడో ఉంటాడు. మళ్ళీ ఎప్పుడో వస్తాడు”అని నమ్ముతూ ఉండేది. ఆ కుర్రవాడి వుత్తరం వచ్చిన రోజు రాత్రి కలలోకి కనిపించాడట “అక్కా! నీకు వీడ్కోలు చెబుతున్నాను. మళ్ళీ నీకు కనిపించను.”అని చెప్పి వెళ్ళిపోతున్నట్లుగా ఆ కలలోని దృశ్యం. సౌరీస్, నిర్మలా కలసి అనుకున్నారు “వసంత్.. ఎలా మాకు చెప్పకుండా వెళ్ళిపోయావు. ముగ్గురం కలసి ఒక నిర్ణయం తీసుకున్నాం కదా! ఒయ్యి కోసం మనం బ్రతకాలి. మన పెద్దమ్మని జాగ్రత్తగా జాగ్రత్తగా చూసుకోవాలని మనం ముగ్గురం కలసి అనుకున్నాం కదా! మమ్మల్ని వదిలేసి ఎలా వెళ్ళిపోయావు? “అని బాధ  పడ్డారు. వసంత్ వెళ్ళిపోయినపుడు కన్న తల్లి రంగనాయకమ్మ గారు కూడా ఇక్కడ లేరు. అరుణాచలం లో ఉండిపోవడం వలన, చెట్టంత కొడుకును చూసుకునే చివరి చూపు కూడా దక్కలేదు. ఇది 1947 సెప్టెంబర్ చివరి ప్రాంతాల్లో జరిగింది.

అవి భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తొలి రోజులు. దేశంలో అక్కడక్కడ రాజకీయ సంక్షోభం వచ్చినప్పటికీ, దేశ ప్రజలందరూ స్వాతంత్రం వచ్చిందనే ఆనందంలో వున్నారు. చలంగారి కుటుంబానికి మాత్రం ఇది తీరని విషాదం. ఆ తరువాత వసంత్ ఎప్పటికీ కనిపించలేదు. ఏమైపోయాడో, ఎక్కడికి వెళ్లిపోయాడో, ఎలా మాయం అయిపోయాడో ఎవ్వరికీ తెలీదు.

మళ్ళీ మనం డాక్టర్ రంగనాయకమ్మ గారి దగ్గరకు వస్తే, ఆవిడకు మద్రాస్ లో ఆపరేషన్ చేశాక పూర్తిగా 3 నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు డాక్టర్లు. ఆ సమయంలో ఎప్పటిలాగే సౌరీస్, నిర్మలా హాస్పిటల్ కొనసాగించారు. డాక్టర్ గారికి అనిపించిందట " వసంత్ ఇంట్లో నుండి వెళ్ళిపోయాడు. తల్లి లేదు. చలం గారు లీలగారితో నూజివీడులో వుంటున్నారు. పిల్లలందరూ కూడా ఎవరి త్రోవలో వాళ్ళు వుంటున్నారు. పెద్ద పిల్లలిద్దరూ కూడా నిరాశా, నిస్పృహ తోటి ఎప్పుడైనా ఇల్లు వదలి వెళ్ళిపోతారేమో" నని. "మీరైనా పెళ్లి చేసుకోండి"అని కేక లేస్తుండేవారట. దానికి సౌరీస్, నిర్మలా "మేం పెళ్లిళ్లు చేసుకొని వెళ్ళిపోతే, నువ్వేమై పోతావు ఒయ్యా !" అనేవారట. "మీరు గనక నిజంగా పెళ్లిళ్లు చేసుకుంటే.. నేను ఆసుపత్రి మూసేసి మీ ఇళ్లల్లో ఒక్కో నెల వుంటాను "అన్నారట. వాళ్ళు పెళ్ళిళ్ళూ చేసుకోలేదు. ఆవిడ ఆసుపత్రి మూసెయ్యడమూ జరగలేదు.

అక్కడ నుండి ఒక సంవత్సరానికి మరొక సంఘటన జరిగింది. డాక్టర్ గారికి అనారోగ్యం రోజురోజుకీ పెరిగిపోతోంది. అయినా ఆవిడ పేషంట్లని చూడడం మానలేదు. ఆ రోజుల్లోనే ఓ సారి ఎవరో వున్న వాళ్ళింట్లో కాన్పు చెయ్యాల్సి వచ్చి, వాళ్ళ వూరు వెళ్లారు. ఆ ఊరు బెజవాడకు దగ్గర్లోనే వుంది. అది వేసవి కాలం. ఆ కాన్పు చేయడం చాలా కష్టం అయింది.

ఆ ఇంట్లో వాళ్లకు చాలా ఆచార వ్యవహారాలు ఉండడంతో, అక్కడే భోజనం చేసి, తల స్నానం చేసి బయలుదేరారు. అసలే ఎండా కాలం. సమయం కాని సమయంలో భోజనం. ఇంటికి వచ్చేసరికి వడదెబ్బ. గుండె దగ్గర నుండి భుజం వరకూ లాగెయ్యడం లాంటివి జరిగాయి. అది చూసిన సౌరీస్ కు అనిపించిందట 'ఒక వేళ పక్ష వాతం లాంటిది వచ్చేస్తుందేమో 'అని. ఎవరైనా డాక్టర్ ని పిలుద్దామని అనుకున్నారు. కానీ, డాక్టర్ గారు మాత్రం "ఏం వద్దు. నాకేం కాదు" అన్నారు.. ఇవన్నీ జరిగేటప్పటికి 1948 వచ్చింది.

ఈ లోగా చిత్రను పెళ్లి చేసి పంపించారు కదా! ఆమె తరచూ అత్తవారి ఇంటి దగ్గర నుండి బెజవాడ వచ్చేస్తూ ఉండేది. డాక్టర్ గారు సర్ది చెప్పి పంపిస్తుండేవారు. కారణం ఏమిటంటే, ఆమె వివాహం చేసుకొన్న భర్త "శ్రీ" తరచూ వుద్యోగం మానేస్తు ఉండేవాడు. ఆ 'శ్రీ ' అమ్మగారు మళ్ళీ ఏదో కొత్త వుద్యోగం వెతికే వారు. ఈ చిత్ర బెజవాడ వస్తే, ఆమెతో పాటు వచ్చేసే వాడు. ఇక్కడ డాక్టర్ రంగనాయకమ్మ గారు కూడా ఏదో ఒక చిన్న ఉద్యోగంలో పెడుతుండేవారు. అయినా వాళ్ళ మధ్య పొరపొచ్చాలు వచ్చాయి. వస్తూ వెళుతూ ఉండేది చిత్ర. అలాంటి రోజుల్లోనే

చిత్రకు పురుడు వచ్చింది. ఆ కాన్పు కూడా డాక్టర్ గారే చేశారు. ఆ పాపకు "డాలీ"అని పేరు పెట్టుకున్నారు. చిత్రకు మొదటి సంతానం. చలం గారి ఇంట్లో తరవాతలో మొదట మనవరాలు ఈ 'డాలీ' ఇవన్నీ 1948 చివరి రోజులు.

ఒక రోజు డాక్టరు గారు ఆసుపత్రి కట్టేసి, మేడ మీద గదిలో కూర్చొని వున్నారు. పక్కనే సౌరీస్ పీట మీద కూర్చొని డాక్టర్ గారి గుండె మీద తల పెట్టుకొని వుంది. హఠాత్తుగా అడిగిందట "ఏమిటి ఒయ్యీ! నీ గుండె సరిగ్గా కొట్టు కోవడం లేదు. నీ గుండె స్పందనలో ఏదో తేడా వుంది. "అంది. ఆ మాటలకు డాక్టర్ గారు నవ్వేసి, "ఏమీ లేదు మొన్న మనం 'దో భాయ్' సినిమా చూశాం కదా! ఆ సినిమాలో 'స్టెతస్కోప్' చూసి ఏదో చెబుతుంటాడు. నువ్వూ అలాగే చెబుతున్నావా?"అన్నారు.

"లేదు నాకేదో అనుమానంగా వుంది. డాక్టర్ గారిని పిలవనా?"

"ఇంత చిన్నదానికి డాక్టర్ అవసరం లేదులే" అన్నారు డాక్టర్ గారు.

అది సాయంకాలం 4,5 గంటల మధ్యలో. చలం గారు దగ్గరకు ఎవరో మిత్రులు వస్తే, వాళ్ళతో కబుర్లు చెబుతున్నారు. సౌరీస్ కి బి. వి, నరసింహ రావుగారు ('బాల బంధు') నేర్పుతున్నాడు. చలంగారికి దగ్గర్లో వున్న మిత్రుల్లో "సుబ్బారావు"అని ఒకతను వున్నాడు. అతనిది తెనాలి. ఆయన "వెంకట చలం! కొంచెం బయటకు వెళదాం వస్తావా?"అని అడిగాడు. ఆ మాట విని డాక్టర్ రంగనాయకమ్మగారు "సుబ్బారావు గారూ! వెంకట చలాన్ని కొంచెం సేపు ఇక్కడే ఉంచ వచ్చు కదా! బయటకు తీసుకువెళుతున్నారా?"అన్నారు. చలం గారి వైపు నిర్లిప్తంగా జాలిగా, బేలగా ఒక చూపు చూసారు ఒయ్యీ. చలంగారి వైపు చూసిన చూపు. ఆయనతో మాట్లాడిన చిట్టచివరి మాటా అదే.

చలంగారూ, సుబ్బారావుగారూ బయటకు వెళ్లి వచ్చేసరికి డాక్టరు గారు పడక కుర్చీలో కూర్చొని నిద్ర పోతున్నట్లుగా ఉన్నారు. సౌరీస్ నేల మీద కూర్చొని పాటలు పాడుతోంది. బహుశా పాట వింటూ ఆమె నిద్ర పోతున్నారేమోనని అనుకున్నారు. హఠాత్తుగా చలంగారి మిత్రుడు సుబ్బారావుగారు, డాక్టరుగారి వైపు చూసి, "అయ్యో! తల పక్కకి వాల్చేసారే!" అన్నారు. గబగబా అందరూ దగ్గరకు వెళ్లి చూసారు. సౌరీస్ కి తెలిసిపోయింది. గుండె స్పందన లేదు. ఒంటి మీద చెయ్యి వేసి చూసేసరికి చల్లగా తగిలింది. ఏం జరిగిందో తెలిసిపోయింది. అయినా సరే, డా:దక్షిణా మూర్తి అని వాళ్లకు బాగా తెలిసినాయన. అతన్ని పిలుచుకు వస్తానని సౌరీస్ వెళ్ళబోయింది. చలం గారు చెప్పారు "ఒయ్యీ చనిపోయింది"అని.

అయినా దక్షిణా మూర్తి గార్ని పిలుచుకు వచ్చింది సౌరీస్. ఆయన యేవో ఇంజెక్షన్లు ఇచ్చారు. కానీ, అప్పటికే డాక్టర్ రంగనాయకమ్మ గారు ఈ లోకంలో లేరు. ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ సౌరీస్ తన ఆత్మకథలో ఈ విధంగా రాసుకున్నారు.

"నరుచేతనూ, హరి చేతనూ, వరమడిగిన కుంతి చేతనూ, వాసువు చేతనూ, ధరణీ శాపము చేతన్ – ఇలా కర్ణుడు వెయ్యి కారణాలతో చనిపోయినట్లుగా డాక్టర్ రంగనాయకమ్మ గారు చనిపోవడానికి అనేక కారణాలు వున్నాయి. అంత బాధతో చనిపోవడానికీ, అనారోగ్యంతో చనిపోవడానికీ, బేలగా చనిపోవడానికీ ఎన్ని కారణాలు ఉన్నాయంటే --- చలం గారిని తన మాయాజాలంలో ఉంచిన లీలగారి వల్లనూ, 'ఇంత కంటే ఈ లోకంలో చేసేదేముంది' అనుకుంటూ, తనను దహించే ప్రేమాగ్ని నుంచి తనకి ఏం కావాలో తెలియక అట్లా వెళ్లిపోయిన వసంత్ వలనా, ఒయ్యి కోసం అన్నీ కాదని నిలిచిపోయిన నిర్మల మీద బెంగ వలనా, స్థిమితం గా నిలిచి కాపరం చేసుకునే అదృష్టం చిత్రకి లభించనందువల్ల, అమ్మ రంగనాయకమ్మ గారు మతి స్థిమితం లేక ఇల్లూ, వాకిలీ వదిలి దూరం కావడం వలనా ---

ఇన్ని కారణాల వల్ల డాక్టర్ రంగనాయకమ్మ గారు అనారోగ్యం బారిన పడ్డారు. ఆ అనారోగ్యం ఆమెని అవలీలగా మృత్యువుకి అప్పగించింది. ఆ రాత్రి గడచింది. యధాతథంగా తెల్లవారింది. సూర్యుడు ఉదయించాడు. ఎవరూ పనులు మానుకోలేదు. ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. పొద్దున్న అయ్యేసరికి డాక్టరు గారి మృత దేహాన్ని మేడ మీద నుండి క్రిందకు తీసుకువచ్చి ఉంచారు. అప్పటికే పేషంట్లు రావడం ప్రారంభమయ్యింది. డాక్టరు గారు వచ్చి చూస్తారని అందరూ ఎదురు చూస్తూ కూర్చున్నారు. కాసేపటికి వాళ్లకు తెలిసింది డాక్టరు గారు ఇక రారని. ఆమె మృత దేహం నిశ్చలంగా ఉన్నప్పటికీ , జీవ కళ ఉట్టిపడుతోంది. అంతకు ముందు రోజే తలకు స్నానం చేసి, ఎవరో ఇచ్చిన కొత్త చీర కట్టుకొని వున్నారు. వాళ్ళు పెంచుకుంటున్న కుక్క, దగ్గరకు వెళ్లి, డాక్టరు గారి ముఖాన్ని నాకింది. అలాంటి సమయంలో ఆ కుక్కని ఎప్పుడూ దగ్గరకు తీసుకుంటుండేవారు. కానీ, ఈ సమయంలో మాత్రం ఏ మాత్రం చలించలేదు. ఎందుకంటే ఈ లోకంలో లేరు కాబట్టి. ఆ సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ సౌరీస్ గారి వాక్యాలలోనే---

" పేదా, గొప్పా బేధం లేకుండా, అందర్నీ ఒకేలాగా హృదయానికి హత్తుకునే ఒయ్యి. కన్య ప్రాయం లోనూ, వైధవ్యం లోనూ, గర్భవతుల్నీ, సమాజపు క్రూర చక్రాల కింద నలిగి, దుర్మరణాల పాలయ్యే వేలాది మంది అభాగినురాలనూ, వాళ్ళ పాపాలనూ రక్షించి, వాళ్ళ తల్లులకీ, బిడ్డలకీ తగిన నెలవులు చూపించిన ఒయ్యి, అన్నార్త, అనాధ శిశువు లందరికీ తానే మాతృ దేవతగా నిలిచి, సంరక్షించిన ఒయ్యి ఇక లేరు. తిరిగిరాని తీరాలకు వెళ్ళిపోయింది--- అనంత గవేషణలో"

ఒక్కొక్కరే పేషంట్లు వస్తున్నారు. గోలుగోలున రోదిస్తున్నారు. ఎన్నేళ్ల అనుబంధాలో అవి. ఎన్నెన్ని జ్ఞాపకాలో. మౌనం మాట్లాడగలిగితే, అక్కడ ప్రతి అణువూ, ఒయ్యి గురించిన ఎన్ని స్మృతి కావ్యాలు వెలువరించేదో. ఉదయం అయ్యింది. చలంగారి మిత్రులు కూడా వచ్చారు. వాళ్ళందరూ , చలం గారు ఏమవుతారో అనే భయంతో

వున్నారు. ఇంత వరకూ ఈ కుటుంబాన్ని అంతా ఒంటి చేత్తో నడిపించింది డాక్టర్ రంగనాయకమ్మ గారే. పొద్దున్నే ఖర్మ కాండలు చేసే బ్రాహ్మలు రావడం ఆలస్యం అయింది. చలం గారు తొందర చేస్తున్నారు. "ఒయ్యిని ఇలా చూడలేను. వెంటనే తీసుకువెళ్ళండి."అంటున్నారు. తరువాత ఎవరిదో మోటారు కారు తీసుకువచ్చారు. ఒయ్యి భౌతిక కాయాన్ని కృష్ణా నదీ తీరానికి తీసుకువెళ్ళేటప్పుడు, అంతిమ ప్రస్థానంలో తోడుగా ఉండి, చిట్టచివరి వరకూ వెళ్లారు చలం గారు.

ఎప్పుడో 30 సంవత్సరాల క్రిందట "నాకు డాక్టరు చదువు చెప్పిస్తావా వెంకట చలం?"అని మద్రాస్ బీచ్ లో అడిగారు. అలా అడిగినటు వదిన గారు నిజంగానే చలం గారి సహాయంతో డాక్టర్ అయ్యారు. ఆమె, చలం గారి కుటుంబం కోసం, సమాజంలోని అనేక మంది బాధా తప్తుల కోసం, తన జీవితాన్ని హారతి కర్పూరం లాగా చేశారు. ఇంత మందికి సహాయం చేసి, ఇంత మంది హృదయాలలో నిలబడిన డాక్టర్ రంగనాయకమ్మ గారి భౌతికకాయం క్షణాలలో పిడికెడు బూడిదగా మారిపోయింది.

ఈ కబురు తెలిసి లీలగారు నూజివీడు నుండి వచ్చారు. చలం గారు హైస్కూల్ లో చదువుకునే రోజుల్లో చలం గారి ప్రేమ కథలకు రాయబారిగా ఉండేవాడు , విష్ణుబొట్ల సుబ్రహ్మణ్యం అనే అతను. ఆయన గుంటూరు నుంచి వచ్చాడు. మరికొద్ది మంది మిత్రులు మాత్రమే వచ్చారు. అప్పుడు తెలిసింది ఎవరు దగ్గర మిత్రులో, ఎవరు వూరికే పలకరించి వెళ్లే వాళ్ళో.. డాక్టర్ రంగనాయకమ్మ గారు వెళ్ళిపోయాక, అసలు ఈయన మనస్థితి ఎలా ఉంటుందో అనుకున్నారు వాళ్ళందరూ. లీలగారు పిల్లలతో చెప్పారు.

"ఒక పని చెయ్యండమ్మా ! మీరు మీ నాన్నగారిని వదలి ఉండలేరు. నేనూ మీ నాన్నగారిని వదలి ఉండలేను. అందుకని మీరందరూ కలసి నూజివీడు వచ్చేయండి. మా తోటలో రెండిళ్ళు కట్టిస్తాను. ఒక ఇంట్లో నేను వుంటాను. ఒక ఇంట్లో మీరూ, నాన్న గారూ వుండండి. నేను అప్పుడప్పుడూ వచ్చి, మీ నాన్న గారిని చూస్తూ వుంటాను." అని ఒక ప్రతిపాదన పెట్టారు. ఐతే అప్పుడే చలం గారు ఒక తుది నిర్ణయం తీసుకున్నారు.

"ఇంక మీకూ, నాకూ కుదరదు. నేను పిల్లల్ని వదలి ఉండలేను. మొన్నటి వరకూ వాళ్ళ అమ్మ వెళ్ళిపోయినప్పటికీ ఒయ్యి చూసుకునేది. అప్పటికే సగం అనాధలైన పిల్లల్ని పూర్తిగా ఆనాధలు చెయ్యడం ఇష్టం లేదు. ఇంక మీరు వెళ్లిపోండి." అన్నారు.

అది లీల గారికీ, చలం గారికీ 7,8 సంవత్సరాలనుండి ఉన్న బంధం తెగిపోయిన క్షణం. ఎంత బతిమాలినా వచ్చే మనిషి కాదనుకుని లీల గారు వెళ్లిపోయారు. ఆ క్షణంలో వాళ్ళ కుటుంబం పరిస్థితి ఎలా ఉన్నదంటే – అంతవరకూ కూడా చలంగారి కుటుంబాన్ని ఏ ఇబ్బందీ లేకుండా కడుపులో పెట్టుకొని కాపాడిన డాక్టర్ రంగనాయకమ్మగారు లేని ఆ ఇంటినీ, తమ భవిష్యత్తునూ వూహించుకోలేక పోతున్నారు. వాళ్ళ జీవితనౌక తాలూకా

చుక్కాని విరిగిపోయింది. కల్పవృక్షం కూలిపోయింది. అంత వరకూ దారి చూపించిన దేవత కనుమరుగయ్యింది. ఒయ్యి చచ్చిపోయింది. చలం గారికి బెజవాడ చచ్చిపోయింది. వాళ్లకు వెంటనే ఎదురయ్యే ప్రశ్న “రేపు ఎలా?”. ఎందుకంటే డాక్టర్ గారు అంతవరకూ సంపాదించి, నిల్వ చేసింది చాలా తక్కువ. చలం గారు వుద్యోగం మానేశారు. ఆయన సంపాదన ఎపుడూ బెజవాడ రాలేదు.

డాక్టర్ గారు ఆమె జాలీ, దయ తోటి పేషెంట్లవద్ద ఎక్కువగా ఫీజులు తీసుకునేవాళ్ళు కాదు. ఆ వచ్చిన కొద్ది మొత్తం కుటుంబానికే ఖర్చు చేశారు. పొదుపు అన్నదే లేదు. ఇక చలం గారికి ఆయన జేబులో ఎప్పుడూ తయారుగా వున్న ప్రతిపాదన ‘ఆత్మ హత్య’. “ఎప్పుడైతే ఒయ్యి చచ్చిపోతుందో, అప్పుడు మనం బతకలేం. అప్పుడు ఆత్మహత్య చేసుకుందాం.” అని పిల్లలకి చెబుతూనే వున్నారు. తానూ అనుకుంటూనే వున్నారు. కానీ, ఇప్పటి పరిస్థితి..!? భార్య రంగనాయకమ్మ గారు అరుణా చలం లో ఒక్కరే వున్నారు. ఆవిడకు ప్రతి నెలా డబ్బులు పంపించాలి. ఒకవేళ ధైర్యం చేసి నిజంగానే ఆత్మ హత్య చేసుకుంటే, ఆమెకు డబ్బులు ఎవరు పంపిస్తారు? అనే ఆలోచనల తోటి ‘ఆత్మహత్య ‘ అనే ప్రతిపాదన తన మనసులోనే దాచేసుకున్నారు. బయటకు చెప్పలేదు.

చలంగారి ఆప్త మిత్రుడు తెనాలిలో ఉంటున్న సుబ్బారావు పిల్లలకి చెప్పాడు.”మీకు ఎలాగూ నర్సింగ్ హోమ్ నడిపే అనుభవం వుంది. నేనెవరైనా ఒక డాక్టర్ గారితో మాట్లాడతాను, కన్సల్టింగ్ డాక్టర్ లా మీకు సహాయం చెయ్యమని. మీరు బాధ్యత తీసుకొని నర్సింగ్ హోమ్ నడపండి. “అని. చెప్పడమే కాకుండా, ఒక కన్సల్టింగ్ డాక్టర్ ని కూడా చూసి పెట్టాడు. ఆ డాక్టర్ గారు రోజూ 2,3 గంటలు వచ్చి, చూసి వెళుతుండేవాడు. ఆయన సహాయం తోటి సౌరీస్, నిర్మలా నర్సింగ్ హోమ్ ని ముందుకు తీసుకు వెళ్లడం ప్రారంభించారు. అలా కొంత ఆదాయం వచ్చేది. ఆ ఒక్క దానిమీదే సరిపోదు కాబట్టీ, మిగతా ఆదాయ వనరుల ఎలా ఉంటాయి అనేది ఇంట్లో వాళ్ళు అందరూ ఆలోచించారు. అప్పటి వరకూ ఏ పత్రిక వాళ్ళనీ “నాకు ఇంత పారితోషికం కావాలి “అని అడగని చలం గారు, ఇప్పుడు పత్రికల వాళ్ళని డిమాండ్ చెయ్యాల్సిన పరిస్థితి వచ్చింది.

అలాగే సౌరీస్ కూడా తాను రాస్తున్న కథలూ, నవలలూ అసంపూర్తిగా ఉంటే, వాటిని పూర్తి చేసి, పత్రికలకు పంపించేది. వాటి ద్వారా వచ్చే పారితోషికం కొంచెం అదుకునేది. వాళ్ళు పెంచుకున్న ‘నర్తకి’ అనే అమ్మాయి వుంది కదా! ఆమెకు అప్పటికి 19, 20 సంవత్సరాల వయసు ఉంటుంది. ఆ రోజుల్లో టాటా కంపెనీ వాళ్ళు ఉత్పత్తులను ఇంటింటికీ తిరిగే ఏజెంటులను నియమించుకుంటున్నారు. నర్తకి ఆ టాటా ఉత్పత్తులను అమ్మి కొంత సంపాదన తీసుకువచ్చేది. అదే రోజుల్లో విజయవాడ ‘ఆకాశవాణి’ కేంద్రం ప్రారంభం అయ్యింది. వాళ్ళు చలం గారిని “ఏదైనా నాటికలు రాసి ఇవ్వండి “అని అడిగారు. ఆయనకు కూడా ఆదాయం రావాలి కాబట్టి, వాళ్ళు అడిగిన వెంటనే

నాటకాలు రాసి ఇవ్వడమే కాకుండా, ఆ నాటకాల్లో సౌరీస్ కీ, నిర్మలకీ వేషాలు ఇవ్వమని అడిగారు. అలా కొంత ఆదాయం వచ్చేది.

అలా ఇంట్లో వాళ్ళందరూ ఎలాగో ఒకలాగా సంపాదించి, ఇల్లు ముందుకు వెళ్ళడానికీ, తమ జీవితాలు గడవడానికీ అన్ని ప్రయత్నాలు చేయసాగారు. ఆ రోజుల్లోనే తల్లి రంగనాయకమ్మ గారు అరుణా చలం నుండి వెనక్కి వచ్చేశారు. అక్కయ్య చనిపోయింది అని తెలిసింది. కానీ, ఆమె తెలిసీ, తెలియని స్థితి లో వుంది. అలాంటి స్థితిలో కూడా చాలా మనస్థాపం చెందారు. చిత్ర కూతురు నెలల పసిపాప 'డాలీ' వుంది కదా! ఆ పాపతో ఆడుకొని ఆ బాధని కొంత మరచిపోగలిగారు. ఇంకా ఇల్లు గడవడానికి సౌరీస్, నిర్మలా, చిత్రాల దగ్గర కొంచెం నగలు బేంక్ లో ఉంటే వాటిని తీసుకువచ్చి అమ్మేశారు. ఇదంతా కుటుంబ పోషణ కోసమే.

నిజానికి నిర్మలకు స్వతహాగా ఆసుపత్రి నిర్వహణ పెద్దగా ఇష్టం లేదు. కాకపోతే, ఒయ్యి కోసమని చేస్తుండేది. అందుకని మిగతా వాళ్ళతో ఏం చెప్పిందంటే.... "సరే!మనం ఎలాగూ ఈ కుటుంబాన్ని ముందుకు తీసుకువెళ్ళడానికి ఇంత ఇబ్బంది పడుతున్నాం కదా! నేను బయటకు వెళ్లి ఏదైనా వుద్యోగం చేసి, సంపాదించి పంపిస్తాను"అని , ఆమె మద్రాస్ వెళ్ళిపోయింది.

ఇక అరాకొరాగా నడుస్తున్న ఆసుపత్రి నిర్వహణ పూర్తిగా సౌరీస్ మీద పడింది. ఆ నిర్వహణే కాకుండా చిత్రనీ, పాపనీ, పక పకనీ, నర్తకినీ అందరినీ కూడా బాధ్యతగా చూసుకోవాల్సిన పనంతా సౌరీస్ మీదే పడింది. నిర్మల వెళ్ళిపోయాక ఆసుపత్రిని నిర్వహించడం అనేది అంత సమంజసమైన కార్య క్రమంలాగ అనిపించలేదు సౌరీస్ కి. ఇదంతా జరిగేసరికి 1949 మధ్య కాలం వచ్చింది. ఇంత సంఘర్షణలో కూడా చలంగారి కలం ఏమాత్రమూ విశ్రాంతి తీసుకోలేదు. ఇన్ని ఇబ్బందులకీ, ఇన్ని కష్టాలకీ లోనయిన రోజుల్లోనే 1948 -49 సంవత్సరాలలోనే చలం గారి అద్భుతమైన రచన, ఇప్పటికి కూడా లక్షలాది మందిని కుదిపేస్తున్న నవల "జీవితాదర్శం"ఈ 49 ప్రాంతాల్లోనే రాశారు. అలాగే 'భారతి' పత్రిక వారు అప్పటి వరకూ చలం గారి రచనలను ఒక్కటి కూడా ప్రచురించలేదు. 'ప్రచురించలేదు' అనే కన్నా 'బహిష్కరించేరు' అనుకోవచ్చు. అలాంటి 'భారతి' పత్రికవారు తమ 25వ సంవత్సరపు ప్రత్యేక సంచిక కోసం చలం గారిని బ్రతిమిలాడి మరీ వ్రాయించుకున్నారు. ఆ సందర్భంలో ఆయన రాసిన 'గల్పిక' ' ఓ పువ్వు పూసింది' . తరువాత భాగాల్లో దాన్ని కూడా పరిచయం చేస్తాను. ఇప్పటికి కూడా చలం గారిని విమర్శించేవారు కూడా ఆ గల్పికను మాత్రం పొగడకుండా ఉండలేరు. అందులో ఆయన రాసిన భాషా, వాడినటువంటి చిత్రాలూ అలాంటివి.

అయితే, చలం గారు రాజకీయాలకు పూర్తిగా దూరంగా లేరు. స్వాతంత్రోద్యమం, గాంధీ ఉద్యమం వున్నాయి కదా! వాటిని ఆయన నిర్లక్ష్యం చేయలేదు. అదే రోజుల్లో ఆయన ఒక వ్యంగ్య గల్పిక రాశారు. అదేమిటంటే

స్వాతంత్రం వచ్చాక కూడా గాంధేయవాదం కొనసాగితే, 20 సంవత్సరాల తర్వాత భారతదేశం ఎలా ఉంటుంది? అనే ఊహ. దీన్ని కూడా రాబోయే భాగాల్లో పరిచయం చేస్తాను.

"జీవిత రథ చక్రాల కింద పడి నలిగితేనే గానీ, అసలైన సాహిత్యం రాదు "అని చలం గారు అందరికీ చెప్పడమే కాదు. తన జీవితంలో కూడా దాన్ని రుజువు చేసుకున్నారు. ఆ రోజుల్లోనే బెజవాడలో డా:అచ్చమాంబ గారని చాలా పేరున్న లేడీ డాక్టరు గారు ఉండేవారు. ఆవిడ డాక్టర్ రంగనాయకమ్మ గారి తర్వాత ప్రాక్టీస్ ప్రారంభించి, చాలా మంచి పేరు తెచ్చుకున్నారు. ఆవిడ సౌరీస్ కి చాలా ధైర్యం ఇచ్చారు.

"మీరు మానెయ్యకండి ఎలాగోలా ఆసుపత్రి నడపండి. ఒక్కదానివి అయినా సరే! నేను కావలసిన సహాయం చేస్తాను "అన్నారు. ఆమె అలా చెప్పినాగానీ, సౌరీస్ కి ముందుకు తీసుకువెళ్ళడానికి ధైర్యం సరిపోలేదు. ఇది ఇలా ఉండగా– వీళ్ళు అద్దెకుంటున్న ఇంటి యజమాని ఇల్లు ఖాళీ చెయ్యమని నోటీసు ఇచ్చారు. ఒకసారి అంతకు ముందే, డాక్టరుగారు, ఉండగానే ఈ నోటీసులు ఇచ్చారు. కానీ, ఆమె అప్పుడు కోర్టుకి వెళ్లి స్టే తెచ్చారు. ఇప్పుడు వాళ్ళు కొత్త నోటీస్ ఎలా ఇచ్చారంటే.. "మీకు మేము ఇల్లు అద్దెకి ఇవ్వలేదు. ఈ ఇల్లు మేం డాక్టరు గారికి ఇచ్చాము. మీరు వెంటనే ఖాళీ చెయ్యండి "అని. కోర్టు నుండి ఆర్డరు కూడా తెచ్చుకుని ఖాళీ చెయ్యమన్నారు. గోరు చుట్టు మీద రోకటి పోటులాగా అదొక పెద్ద ఇబ్బంది కలిగింది.

సుమారు అదే రోజుల్లో అరుణా చలం నుండి చలం గారికి కబురు వచ్చింది. "భగవాన్ కి ఆరోగ్యం క్షీణిస్తోంది. ఎక్కువ రోజులు బ్రతకరు "అని. అందుకని చలంగారు అరుణా చలం వెళ్లారు. చలంగారు అలా వెళుతుంటే, ఎవరో జ్యోతిష్యుడో, ప్రకృతి వైద్యుడో కనిపించి, "మీరు 6 నెలల కంటే, ఎక్కువ బ్రతకరు. మీ అనారోగ్యం ఏమిటో నాకు తెలుసు "అని చెప్పారట. ఆ విషయం సౌరీస్ కి చెబితే ' అయ్యో! నాన్న గారికి ఇలా అవుతుందా?' అని ఆమె చాలా బాధ పడింది. కానీ, అలా ఏమీ జరగలేదు. మొత్తానికి ఇన్ని ఇబ్బందుల్లో ఉన్న, వాళ్ళు ఏం అనుకున్నారంటే, "ఇకపై బెజవాడలో కొనసాగడం కష్టం. ఎలాగైనా సరే, అందరం అరుణా చలం వెళ్ళిపోదాం."అని. తల్లి రంగనాయకమ్మ గారు కూడా ఆ ప్రతిపాదనను బలపరిచారు. "అక్కడికే వచ్చేయండి. అక్కడే ఎలాగోలా బ్రతుకుదాం" అన్నారు.

కానీ, అక్కడకు వెళ్లి ఏం చేస్తారు?ఎంత కాలం వుంటారు?ఎలా బ్రతుకుతారు?మొత్తం బేంక్ బేలన్స్ చూసుకుంటే 4,5 వేల కంటే ఎక్కువ లేదు. కుటుంబ సభ్యులు ఎక్కువ. ఎలా జరుగుతుంది?ఏమిటి?అనే ఆలోచనే చలం గారికి రాలేదు. ఆయనే చెప్పుకున్నారు "ఇంత కాలం నన్ను భగవాన్ కాపాడాడు. ఆ తరువాత వెళ్ళాక ఆయనే చూసుకుంటాడు. ఆయన మీద భాద్యత వేసి అరుణా చలం వెళ్ళడానికే నిర్ణయించుకున్నాము "అని ఆయన మిత్రులకు రాసిన వుత్తరం లో రాశారు. మిత్రులకు రాసిన వుత్తరంలో ఇంకా ఏం వ్రాశారంటే – "భగవాన్

అనుగ్రహం వలన శాంతిని సాధిస్తాను. లేదా ఆ ప్రయత్నం లో మరణిస్తాను."అని. ఇది సుమారు 1950 ప్రాంతాల్లో జరిగింది.

చిట్టచివరికి చలం గారు బెజవాడ నుండి వెళ్ళి పోయేటటు వంటి రోజు వచ్చింది. అది 1950 ఫిబ్రవరి నెల. ఇక వెళ్లిపోదాము అని నిర్ణయించున్నాక, ఇంట్లో వున్న సామానంతా కూడా అమ్మేశారు. ఆ సామాన్లు అమ్మేటప్పుడు కూడా ఇరుగుపొరుగు "ఆ సామాన్లు కొనవద్దు " అనేవాళ్లట. అలాగే వీళ్ళను హేళన చేసేవారు చాలా మంది వున్నారు. ఎలాగో ఉన్నవన్నీ అమ్మేసుకొని, చలం గారి అసంపూర్తి రచనలన్నీ, అలాగే తనకు ఎవరో రాసినటువంటి ఉత్తరాలనీ , వీటన్నిటినీ బాయిలర్ లో వేసి కాల్చేశారు.

"ఇక ఎట్టి పరిస్థితిలోనూ తెలుగు దేశానికి రాను. తెలుగు గడ్డ పై అడుగు పెట్టను. తెలుగు నేల గాలి పీల్చను " అని ఆయన మనసులో గట్టిగా నిర్ణయం తీసుకున్నారు. ఇక వెళ్ళడానికి ప్రయత్నాలు తుది దశకు చేరుకున్నాయి. చలంగారు ఆవిధంగా బెజవాడని వదిలి వెళ్లి పోదాము అనుకున్నప్పుడు రెండు లక్షలు వున్న బెజవాడ జనాభాలో "మేము వున్నాము మీరు వెళ్ళకండి." అని ధైర్యం చెప్పిన వారు కేవలం 4,5 గురు మాత్రమే. మూడు దశాబ్దాలుగా తన రచనలతో ఎంతో సంచలనం కలిగించిన చలం గారికి, బెజవాడను వదలి వెళ్లిపోతుంటే, ఎవరూ వీడ్కోలు సభ పెట్టలేదు. ఏ పత్రికలోనూ వార్త కూడా రాలేదు. ఆ విధంగా చలం గారు బెజవాడను వదిలేసి, అరుణాచలం వెళ్లడం అనే కార్యక్రమం అతి అనామకంగా అతి సాధారణంగా జరిగిపోయింది. ఇంకా వివరంగా చెప్పాలంటే –

1950 ఫిబ్రవరి 8 న బెజవాడ రైల్వే స్టేషన్ లో చలం గారూ, ఆయన సామాన్లూ, ఆడపిల్లలూ, చిన్న పసిపాపా, వాళ్ళు పెంచుకుంటున్న కుక్క పిల్లా సిద్ధంగా ఉన్నారు. వాళ్లకు వీడ్కోలు ఇవ్వడానికి నలుగురంటే నలుగురు మిత్రులు వచ్చారు. అరుణాచలం చేరుకున్నాక, ఆ తరువాత మరో ఇరవై తొమ్మిది సంవత్సరాలు జీవించిన చలం గారు ఒక్కసారి కూడా తెలుగు నేల మీద అడుగు పెట్టలేదు. తెలుగు గాలిని పీల్చలేదు. అయితే అరుణాచలం వెళ్లినంత మాత్రాన, భగవాన్ మీద అంత నమ్మకం ఉన్నంత మాత్రానా అంత తేలికగా జీవితం కొనసాగలేదు. వెళ్లిన మొట్టమొదటి రెండు సంవత్సరాలూ చాలా ఇబ్బందులకు గురయ్యారు. ఆ ఇబ్బందులకు గురిచేసిన వారు కూడా తెలుగు వారే. అక్కడకు వెళ్లినా గానీ, చలం గారిని తెలుగు వాళ్ళు వదలలేదు. అసలు అక్కడ ఏం జరిగిందో, తరువాత భాగంలో తెలుసుకుందాం.... ★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చేనెలలో)

అక్షరీకరణ – వి. వెంకటరావు

2019 ఏప్రిల్ 9 న, ప్రసారమైన ఈ టాక్ షోని ఇక్కడ వినవచ్చు

COMMENTS